# వంతెన

## అమ్మంగి వేణుగోపాల్




ఆ వూరి మురికివాగు చిన్నదేం కాదు. కొత్తవారెవరూ అది మురికివాగని పోల్చుకోలేరు. కడుపులో ఎంతో కల్మశాన్ని దాచుకొని పైకి మాత్రం శుభ్రంగా, కల్లాకపటం ఎరుగని చిన్నతరహా పెద్దమనిషిలాగా ప్రవహిస్తూ వుంది. దానిమీద వంతెన.

నారాయణకు ఆ వంతెనమీద చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ బతికే వాళ్ళంతా తెలుసు. వాళ్ళంతా అతని హోటల్ ఖాతాదారులే. ఉదయం తొమ్మిదయింది. వాళ్ళంతా అప్పుడే దుకాణాలు తెరిచారు. జనం ఎక్కువగా లేరు. తన దుకాణం దగ్గరికి రాగానే చెప్పులమ్ముకునే నరహరి.

'రండి సార్ రండి. క్యూలో నిలబడండి. పోతే దొర్కద్. బెహత్రీన్ మాల్' అన్నాడు నవ్వుతూ.

'శానా రష్ వున్నట్టున్నది. జరఫని జూస్కొని వస్త' అని నరహరి వీపుమీద రెండు దెబ్బలేస్తూ ముందుకు పోయాడు నారాయణ. ఇదంతా చూస్తున్న పెన్నులమ్ముకునే ఇరవైయేండ్ల షరీఫ్ నారాయణకు అడ్డంవస్తూ.

'ఇది జూడు శిరీనివాసులు సేట్. ఇది జెపాన్ పెన్ వున్నై. దీన్ని జెర్మనీ గోల్డెన్ నిబ్ వున్నై. గ్యారంటీ మాల్' అన్నాడు.

'ఇదేందో నీ సొంత జెపాన్ వున్నట్టున్నదిరా పోరగా. నీయప్ప సంపాయించిన జెపానారా' అంటూ 'వీడు పదిరూపాయలకుమీదనే ఇయ్యాలె' అనుకుంటూ ముందుకు సాగాడు.

నారాయణ సాధారణంగా ఎవరికీ గంభీరంగా కనిపించడు. అంత వొత్తుగడ్డంలో నుంచి కూడా చిరునవ్వు కనిపిస్తూంటుంది. పైకి చూశాడు. తన హోటల్. వంతెననూ, వంతెనమీద నడిచే వాళ్ళనూ వరౌనంగా ఆహ్వానించే 'శ్రీనివాస హోటల్'.

అతనిలో పితృవాత్సల్యం ఉప్పొంగింది. అతడు తన బ్రతుకులో ఈ మాత్రం చేస్తాననుకోలేదు.

ముందర ఎవరో పలకరించినట్లయితే చూశాడు. వంతెన చివర కూచున్న కుంటి వీరప్ప 'శణార్తిదొర. శణార్తి' అంటూ నమస్కారం చేస్తున్నాడు. కుంటి వీరప్పను నారాయణ అంతకు ముందు వంతెన మీద చూడలేదు. అతని ముందు తెల్లబట్ట పరిచి వుంది.

'వీడు మంచిపనే సుదురాయించుకున్నడు' అనుకున్నాడు. అతని పక్కకు ఇంకో అతను కూచుని వున్నాడు. నారాయణ హఠాత్తుగా ఆగిపోయాడు. ఆ రెండో వ్యక్తి తన జీవం లేని రెండు కళ్ళను తేలేసి ఆకాశం వంక చూస్తూ తలవూపుతున్నాడు. బొక్కలు కనిపించే బక్కపలుచని చామనఛాయ ముఖం. అతని ముందు కూడా బట్ట పరిచి వుంది. నారాయణ రెండడుగులు ముందుకేసి అతణ్ని బాగా చూసి హోటల్లోకి నడిచాడు.

తండ్రి రావటం చూసి గల్లా దగ్గర కూచున్న కొడుకు లేచి తాళం చేతులు అతనికిచ్చేసి ఇంటి ముఖం పట్టాడు. సర్వర్లకు నారాయణ రోజులాగా కనిపించలేదు. ముఖం వాడి పోయినట్లున్నా పెరిగిన గడ్డం వల్ల గంభీరంగా కనిపించాడు.

అతణ్ని కొంచెం ఎరిగున్న వాళ్ళంతా

ఎప్పుడంటే అప్పుడు ఏ విషయమంటే ఆ విషయం అడిగేవాళ్లు. అతని 'మూడ్' విషయం ఎవరూ అంతగా పట్టించుకోలేదు. కొంచెం వెనకా ముందు లాడుతూనే వంతెన మీద సెకెండ్‌హాండ్ పుస్తకాలు అమ్ముకునే గంగరెడ్డి,

'సూడు శ్రీనివాస్ సేట్ నన్ను బతుకుమంటవా వద్దంటవా. నీ కొడుకేమో ఇగ హోటల్‌కే రావద్దని చెప్పిండు. ఇంతకు ముందు నేను ఉద్దెర తిని ముంచినట్లు మాట్లాడిండు' అన్నాడు. నారాయణ కొంచెం విసుక్కున్నాడు.

'మాఁటిగూడ నడవాల్నా వొద్దా భై. ఉన్నోడు లేనోడు అందరు ఉద్దెర్లు పెడ్తె యాపారం మూడు దినాలు ముందల పడదు.' అన్నాడు.

ఈ మాట గూడా నారాయణ అంటాడని అనుకోలేదు గంగారెడ్డి. ఇంతకు ముందైతే. 'మంచిది రెడ్డి వానితోటి చెప్త. పో తిను పో' అనేవాడు.

'అరే నువ్వు దినాం పొద్దున్నాసక్రు చూస్తనే వున్నావుగద భై. ఏమన్న గిరాకైతున్నద చెప్పు. ఏగడ్డి కొడుకన్న వచ్చి ఒక పుస్తకమన్న కొనుక్కుంటున్నాడ చెప్పు. జెర చెయ్యి కుదుర్కోనియ్యి పదిగొడు తరువైత ఇస్త' అంటూ టేబుల్ ముందు కూచున్నాడు గంగారెడ్డి...నారాయణ సర్వర్‌ను పిల్చి 'రెడ్డికి ఏంకావాల్నో ఇయ్యి' అన్నాడు.

పని లేనప్పుడల్లా వంతెన వంక చూస్తున్నాడు నారాయణ కుంటి వీరప్ప అతనిపక్కన గుడ్డిమనిషి. వాళ్లముందు అంతగా మాయని తెల్లబట్టలు. ఎండలో మెరుస్తూ చిల్లరడబ్బులు కుంటి వీరప్ప ఇంతకుముందు నారాయణ హోటల్‌లో చాయ్ తాగి చాలా వినయంగా బిల్లు చెల్లించినవాడే. అతడు హోటల్‌లో కాలు పెట్టినప్పుడు, హోటల్‌నుంచి పోయేటప్పుడూ రెండుసార్లు చాలా వినయంగా నారాయణకు నమస్కారాలు చేసేవాడు. అతనికి మొన్న తెలిసింది ఎందుకు వీరప్ప అంత వినయంగా నమస్కారాలు చేసేవాడో. మొన్నరాత్రి నారాయణ హోటల్ విడిచి ఇంటికిపోయిన తర్వాత వీరప్ప వచ్చాడు.

'మాది సంగారెడ్డిప్యాట దొరా, కాలు లేనోన్ని. కట్టెల మిషిన్ల పోయింది. మీ హోటల్ల ఏమన్న నౌఖరీ ఇస్తె బతికి పోత' అన్నాడు. నారాయణ అతణ్ని ఎగాదిగా చూసి,

'నువ్వు చేసేపని మాదెగ్గరేముంటదిరా బాబు' అన్నాడు.

'ఎంగిలి గిలాసలు కోప్‌తస్తర్లు గిన కూసున్నజాగల కడిగిస్త దొర. నాకే మియ్యకు ఇంత రొండుపుటలు అన్నం పెడ్తె సాలు' అన్నాడు.

'నీకు కూసున్న జాగలకు అవ్వీ ఇవ్వీ తెచ్చియ్యనికో నౌకరు కావాలె తీస్కపోనికో నౌకరు కావాలె. ఎందుకు? మాకేం తీట పట్టినాది?' అన్నాడు.

'కొంచెం దయ జూపుర్ని దొరా బతికిచెడ్డోన్ని. సంగారెడ్డి బసిస్టాన్‌కాడ గుడిసె హోటల్ నడిపినోన్నె. బాగ ఇంత ఎనకకేసింటి. ఏం జెయ్యాలె, దానమ్మ కడుపుకాల నా పెండ్లాం ముండ తీస్కపొయ్యి యాయా మిండెలకు పెట్టుకున్నదొ. నేను దివాలా దీస్తి. నలుగుట్ల నగుబాట్ల పాలైతి.'

వీరప్ప కండ్లు తుడుచుకున్నాడు. ఇరవైయ్యేదు ముప్పైనడుమ బలంగానే వుంటాడు. ముఖంలో చెమట మెరుస్తున్నది. నారాయణ కొంచెం కదలినాడు.

'నన్నేం చెయ్యమంటవురారి. ఇప్పటికె నాదెగ్గర ఏకాన పనుంటె దొవ్వాన నౌకర్లున్నరు. ఇంకెవరి తనన్న పని చూస్కో. అందాన్క దినాం పొద్దుగాలొచ్చి హోటల్ల చాయ్‌తాగి పోతుండు'. అన్నాడు. పని చేసేస్థితిలో వున్నప్పుడు కూచుని తినడం మంచిదికాదని నారాయణ అభిప్రాయం.

వీరప్ప పోయాడు. కట్టె టకటక జాలిగా వినిపించింది. ఈ రోజు వంతెన మీద అడుక్కు తింటున్నాడు.

నారాయణను ఈ వూరివాళ్లంతా శ్రీనివాసులనే పిలుస్తారు. అతడీవూళ్లో హోటల్ పెట్టి మూడేళ్లయింది. జిల్లా. రైల్వేస్టేషన్ వుంది. ఆ వూళ్లోవున్న రెండు పెద్ద హోటళ్లలో ఇది ఒకటి. నారాయణ హోటల్‌కేమీ తక్కువచేయ్యలేదు, మంచి ఫర్నిచర్ తెప్పించాడు. సర్వర్లను శుభ్రంగా వుంచాడు. తిట్టికొట్టికాకుండా ప్రేమతో పని తీసుకున్నాడు. అందుకే ఆ మూడేళ్లలో కొత్తవాళ్లు వచ్చారు కాని పాతవాళ్లు పోలేదు.

అతనితోటి వ్యాపారస్థులు అతణ్ని పేకాటలోకి దించారు, మొదట్లో అతడు చాలా పిచ్చిగా ఆడేవాడు. రాను రాను తగ్గించుకుని రాజకీయనాయకులతో, హోదాలోవున్న ఆఫీసర్లతో పరిచయం కోసం మాత్రమే ఆ ఆటను ఉపయోగించుకున్నాడు.

రోజులాగా నవ్వుతూ పలకరిస్తూ, కాకుండా గంభీరంగా అసాధారణంగా వున్నందుకు నౌకర్లు చకచకా పనిచేసుకుంటూ పోతున్నారు.

నారాయణ మళ్లీ మళ్లీ వంతెన వంక చూస్తున్నాడు. కుంటి వీరప్ప ముఖం మీద గుడ్డ కప్పుకొని కట్టెను పక్కలో పెట్టుకుని పడుకున్నాడు. గుడ్డిమనిషి మాత్రం అలాగే కూచుని జీవంలేని కళ్లను ఆకాశంవంక పెట్టి తల వూపుతూనే వున్నాడు. ఆ మధ్యాహ్నపు ఎండలో నారాయణకు ఆ బక్కపలుచని చామనఛాయ ముఖం చాలా దగ్గరగా, నగ్నంగా కనిపిస్తూంది.

నారాయణకు ఈరోజు మనస్సేమీ బాగా లేదు. తలనొప్పి మొదలయింది. కాళ్లలో సన్న వణుకు కూడా మొదలయింది. మనస్సులో దారీ తెన్నూ లేని అస్పష్టమైన ఆలోచనలు. ఎత్తుగడలు. వంతెన వంక ధైర్యంగా చూడలేక పోతున్నాడు.

గల్లామీద కూచోడానికి కొడుకు రాగానే లేచి

'ఇయాళ ఆకలైతలేదురారి. ఎందుకో నెత్తి నొస్తున్నది. బంగ్లామీద పండుకుంట. ఒక నెత్తినొప్పిగోలి, ఒక చాయ్ పంపియ్యి' అని నడిచాడు.

మెడల్పుగా దగ్గర దగ్గరగావున్న పది మెట్లను ఎక్కాడు. ఈ మేడనే ముందు స్టోర్‌రూంగా వాడుకునే వారు. చక్కెర సంచులవంటి బరువైన వస్తువులు పైన వుండడం మంచిది కాదని వెనుక పెరట్లో స్టోర్ రూం కట్టించాడు. అప్పటినుంచి పైన ఖాళీగా శుభ్రంగా వుంటుంది. ఈ మేడకు రోడ్డువైపున వున్న గోడను, స్తంభాలువుంచి పడ

గొర్రెని ఫర్నీచర్ వేసేస్తే, ఎండాకాల మైనా, ఏకాలమైనా ఇష్టమున్నవాళ్ళు పైన కూచోవచ్చు. పైన కొత్తగా 'ఫ్యామిలీ సెక్షన్' తెరవాలని కొడుకు అంటున్నాడు కూడా.

సర్వర్ అలనొప్పిమాత్రే, చాయ్ తెచ్చాడు. నారాయణ మంచంమీదినుంచి లేచి గోళీ వేసుకుని చాయ్ తాగాడు.

సర్వర్ వెళ్ళిపోగానే వంతెన వైపున్న కిటికీ తెరిచాడు. గాలి చాలా ఉద్ధృతంగా వీస్తున్నది. పట్టలేక పట్టలేక విపరీతంగా నవ్వేవాడిలాగ చెట్లు కిందికీ పైకీ ఊగుతున్నాయి. మురికివాగు ప్రవాహం ఒక నిమిషం స్తంభించి పట్లయింది. వంతెనమీద నడిచేవాళ్ళు ఆగిపోయి కళ్ళల్లోపడ్డ దుమ్మును తుడుచుకుంటున్నారు. పుస్తకాలమీద రాళ్ళు పెట్టేస్తున్నాడు గంగారెడ్డి. మంటి వీరప్ప, ఆ గుడ్డిమనిషీ తను ముందున్న గుడ్డలను మళ్ళీ మళ్ళీ సరుచుకుంటున్నారు. వాళ్ళవంక ఎక్కువ సేపు చూడలేకపోయాడు నారాయణ. మళ్ళీ కళ్ళల్లో ఏణుకులాంటిది వచ్చింది. వెంటనే కిటికీ మూసేసి మంచంమీద వాలిపోయాడు. అతనికి తన కళ్ళముందు ఏవేవో కనిపిస్తున్నాయి. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. అయినా ఏవేవో దృశ్యాలు బలవంతంగా కనిపించసాగాయి.

* * *

నారాయణకు బుద్ధి తెలిసినప్పటి నుంచీ స్వంత హోటల్ పెట్టాలని వుండేది. అతడు చిన్నప్పటి నుంచి ఎన్ని హోటళ్ళలో నౌకరీ చేశాడో లెక్కలేదు. అతనే బతక లేడంటే, పెళ్ళాం, ఒక పిల్లవాడు. డబ్బు ఎట్లా సంపాయించడమా అని రాత్రిళ్ళు నిద్రపోకుండా పిచ్చిగా ఆలోచించేవాడు. అతడు చివరిసారిగా బోధన్‌లో వున్న హోటల్‌లో పని చేశాడు. చూస్తుండగానే ఒక సంవత్సరంలోగా ఆ హోటల్ యజమాని పెద్ద మేడ కట్టేశాడు. అప్పటి నుంచీ నారాయణకు హోటల్ పెట్టాలనే పిచ్చి ముదిరి పోయింది. తనే చుట్టుపక్కల వారిని పరిశీలించేవాడు. ఎవరి దగ్గర ఎంత డబ్బు వున్నదీ అంచనా వేశేవాడు. భార్యను చెరుకు తోటలకు కూలికి పంపేవాడు.

నాలుగైదు నెలలు బాగా గాలించిన తర్వాత నారాయణకు కావలసిన వ్యక్తి దొరికాడు. అతడే కూలినాలి చేసుకుని బతికే గోవిందు. రోజు పొద్దుపోయిన తర్వాత హోటల్‌కు వచ్చి చాయ్ మాత్రమే తాగి పోతుంటాడు. గడ్డ కట్టిన ఎర్రని నెత్తుటి ముద్ద వంటి కుడి కన్ను. చామనఛాయ. బక్క పలుచగా వుంటాడు. మాసిన బట్టలు. తలకు నిండుగా రుమాలు. అమాయకుడని చూడగానే తెలుస్తుంది.

'కన్నుకేమైంది' అడిగాడు నారాయణ.

'చెరుకు కోసింది. రొండేండ్లాయె' అన్నాడు గోవిందు.

'పాపం' అని చాలా సానుభూతి చూపించాడు.


అట్లా స్నేహం కలిపేశాడు. తాను డ్యూటీలో వున్నప్పుడు రమ్మని రెండు మూడు టిఫిన్లు టీ ఇచ్చి, టీ బిల్లు మాత్రమే తెచ్చిచ్చే వాడు. రాత్రి డ్యూటీ లేనినాడు సినిమాకు తీసుకొని పోయేవాడు.

డబ్బు ఖర్చు చేయడానికి వెనుక ముందులాడే గోవిందుకు ఈ స్నేహం నచ్చింది. గనుగెద్దులాంటి అతని బతుకులో ఈ స్నేహం కొత్తగా బాగా కనిపించింది.

మొత్తానికి నాలుగైదు నెలల్లో నారాయణ అతని జీవితంలో చొచ్చుకొని పోయాడు. అతని మీద ఎంతో అధికారాన్ని సంపాదించాడు.

ఒకసారి నారాయణ అతని యింటికి పోయాడు. పాత పెంకుటిల్లు. రెండే రెండు గదులు. చిన్న పెరడు. ఒక గదిలో మూలకు మూడురాళ్ళు. కట్టెలు, పిడకలు వున్నాయి. అడుగులు మసిబారి పోయిన రెండు అల్యూమినియం పాత్రలు చిన్న కుండలు వున్నాయి. గోవిందు నారాయణను రెండో గదిలో కూచో పెట్టాడు, కింద గోనెసంచి వేసి. వాసాలకు కట్టిన తాడు మీద పాతబట్టలు వున్నాయి. మూలకు పెద్దగా వున్న పాతపెట్టె. దానికి లావైన తాళం వుంది. గోవిందు చిన్నప్పటినుంచీ సంపాదిస్తున్నాడు. కలరా వచ్చి పోయిన భార్య ఆర్నెల్ల క్రితంవరకూ సంపాదించేది. రోజుకు ఎనిమిదణాలకు మించి ఖర్చు చేయని గోవిందు ఆ డబ్బంతా ఏం చేస్తున్నట్టు. నారాయణతో తాను రెండోపెళ్ళి చేసుకోదలచినట్లు ఈనడుమ చెప్పాడు.

సగం బీడీ కాల్చి బయటకు విసిరేసి నారాయణ మొదలుపెట్టాడు. 'మా సేట్ గాడు ఏం సంపాయిస్తున్నాడు గోవిందూ చెప్ప తరంగాదనుకో. అన్నిఖర్చులు పోంగ వాన్కి దినాం ముప్పై మిగులుతున్న యంటె మాములు మాటనా. నెలకు దెగ్గర దెగ్గర వెయ్యాయె. వాని అస్లీ



పెట్టుబడి యెంతనుకున్నవు? ఐదు వేలు. ఐదునెల్లా సంపాయించిండు.' అన్నాడు.

'ఉన్న మారాజులు ఏ దందలవన్న సంపాయిస్తరు నారాయణా! లేనోడు యెండ్లు యేలుబెట్టినా సున్నకు సున్న హళ్లికిహళ్లి.'

'నువ్వన్నది నిజమేగాని మనసుంటోళ్లకు రాని పనేంగాదది, అరే, ఇది వారకు నేనుగూడ ఒక హోటల్ పెట్టెస్తుంటె. ఆ ముండాకొడుకు దోఖా చేసె.' అన్నాడు నారాయణ. 'ఏమైంది?' అన్నాడు గోవిందు.

'ఇంతకుముందు నేను నిజామాబాదల పనిచేసేటప్పుడు నాతోటె రాజయ్య అని ఇంకోడు పనిచేస్తుండె. ముందే అనుకున్నాము. ఆశాన ఆశాన హిస్సాల ఇద్దరం కలిసి హోటల్ పెట్టాల్నని. యాడాదైనంక నేనో వెయ్యినర, వాడో వెయ్యివర సంపాయించినము. వాడేమన్న డంటె 'నేను నాల్గైదు తాలూకాలు తిర్గొచ్చి అడ్డా ఏర్పాటు చేసుకొని ఫర్నిచర్ గిర్నిచర్ జమాయించి నాల్గైదు దినాలల్ల వచ్చేస్త. రూపాలిచ్చెయ్యి. ఇద్దరం పోతె డబల్ ఖర్చులు' అన్నడు. యాడాది కల్సున్నము ఎవన్కి అనుమానమొస్తది. పైసలిచ్చేసిన. వాడు పోయిండు ఎన్మిదొద్దులాయె ఏదొద్దులాయె. ఇగరాడగ రాడు. నెలాయె. పైసనా రొండు పైసలా వెయ్యినర. నాకేం సుద్దురా యించలేదు. ఆఖర్కి పోలీస్ ఇస్టేషన్ల ఫిర్యాదు చేసిన. ఆపోలీసు ముండాకొడుకులు బద్మాశులు. వానికోసం దేవులాడిండ్రో లేదో గని నన్న పట్టుకున్నరు. 'నీ క్యాడి నుంచి వచ్చినయి వెయినర' అని అడిగిండ్రు. 'సపాయించిన' అంటె ఇడుస్తర 'నువ్వు చేసేది ఎంగిలి గిలాసలు కడిగేపని ఇన్నిరూపాలాడి కెల్లొస్తయి? చెప్పు యాడ దొంగతనం చేసినవు?' అని పట్టుకున్నారు. ఇగేంజెయ్యాలె. ఎద్దు పోలీసోడు తుర్కోడుండె. పెద్దపెద్ద మీసాలు దొడ్డుగ అచ్చ రావణాసురుని ల్యాకోతె వుంటడనుకో. 'బేటా తెస్తావా దో సాలా పాల్ దీస్కరా లేకుంటె నిన్ను బొక్కల్ల నూకేస్త' అన్నాడు. ఇగ దేవుడా అని నా పెండ్లాం మెయ్యిమీదున్న బంగారమమ్మి



నూటయాభై రూపాలిచ్చి వాని కాళ్లమీద బడితె ఇడిసేసిండ్రు. ఇట్ల గోవిందూ, ఉన్నది బోయింది, ఉంచుకున్నది బోయింది. ఆ పెద్ద తెల్సింది. ఎంత పొయ్యినా నోరు మూస్కొని ఊకోవాలెగాని, పోలీసోల్ల దగ్గర్కిమాత్రం పోగూడ దాని.'

'ఆడు ఆకర్కి జిక్కనేలేదా'

'యాడ? ఇదువారకు వాని పత్తా లేదు.'

'పాపం! ఇట్ల దోఖా జేసి ఆడేం ముందలబడ్తడు నారాయణా నీ ఉసురు ముడ్తది జూడు.' అని ఓదార్చాడు గోవిందు.

ఇద్దరూ మళ్లీ బీడీలు కాల్చారు. 'పదు అట్ల పొయ్యి ఏమన్న తినొద్దాము' అన్నాడు నారాయణ. దగ్గరలోనే వున్న హోటల్లో ఇద్దరూ టిఫిన్లు తిని టీ తాగారు. అసలు విషయాని కొచ్చాడు నారాయణ..

'ఈ పనితోటి యాష్ట వచ్చేసింది గోవిందూ, ఈ నెలల యెట్లనన్నచేసి హోటల్ పెట్టెయ్యా లనుకుంటున్న. చేతిల రొండువెయిలుంచుకొని ఒకని కిందెందుకు పని చెయ్యాలె. ఎవడు చెప్పిన బుద్దంట. సీతారాములు కొడుకు లేడా ఈరబ్రహ్మం. నీకు గుర్తున్నదా, వాడు ఖైతెల్లబట్ట లేసుకొని మా పాన్‌షాప్‌ల అకు తింటుంటడు జూడు...'

'తను నాకు కూసంలేదు' అన్నాడు గోవిందు.

'లేకపోతె మానె. ఎప్పుడన్న చూపిస్తగని, వాణ్ణడిగిన హోటల్ పెడ్దామా రాని. సంక లెగరేసిండు కొడుకు. రొండు వెయిలు ఇప్పుడంటె ఇప్పుడు దెస్త నడు పోదాము అన్నడు. వానికి నేనేం మాటియ్యలేదనుకో రొండు మూడొద్దులైనంక యామాట చెప్తాన్న'

'అట్లెందుకు కల్సి పెట్టెయ్య మంటివి' అన్నాడు గోవిందు.

'సూడు గోవిందూ. యాపారమన్నంక ఒకనిమీద ఒకనికి ఇశ్వాసముండాలె. కల్సి పెయ్యి దాసుకోకుండ కష్టం చెయ్యాలె. ఈరబ్రహ్మంగాడు ఎసుంటోడా నాకు తెల్వదు. ఇదువారకే నాకు తట్టు దాకింది. కింద సూసుమంట సదు వాలె. ఈరబ్రహ్మంగాడు ఇస్త్రీబట్ట లేసుకొని లాడ్‌సాబ్ ల్యాక గల్లామీద కూసుంటె, నేను కూలోనిల్యాక శాకిరి చెయ్యాలె. అందుకే నీ అసుంటోడు దొర్కితె మంచిగుండేది చూస్తున్న' అని ఆగిపోయాడు. అంత నమ్మకం తనలో వుంచినందుకు గోవిందు తబ్బిబ్బయాడు. కొంచెం సిగ్గుపడుతూ 'నా అసుంటోనితోనేమైతది నారాయణా' అన్నాడు. గోవిందు తనకు తాను ఆపాదించుకుంటున్న బీదరికంమీద ఏమీ వ్యాఖ్యానించకుండా పెద్దమనిషి లాగా అన్నాడు నారాయణ.

'చెప్పలేదంటవని చెప్తి. పెండ్లి దేమున్నది. సంపాయించినంక ఒకటి కాదు పది పెండ్లిళ్లు చేసుకోవచ్చు.

హోటల్ పెట్టి సంపాయించుడుకన్న హల్కాపని లేదు. ఒక చాయ్ సంగతే తీస్కో. ఐదుపైసల షెక్కరి, ఐదుపైసల చాయ్‌పొడి ఐదుపైసల పాలతోటి రొండు కోపుల చాయ్ తయారైతది. పదిహేన్ పైసలు ఖర్చుచేసి ముప్పై పైసలు సంపాయించొచ్చు. గంటకు నాల్గుకోపుల చాయ్ అమ్ముడుబోతె, తక్వలతక్వ పన్నెండు గంటలల్ల యాభైకోపులు. అంటె నాల్గు రూపాలు లాభం. ఇడ్లీలగిడ్లీలదొక ఆరు రూపాలనుకో. మొత్త దినాం ఖర్చులుపోంగ పదిరూపాలకు తక్వ కండ్ల జూడవు. అంటె నెలకు మున్నూరు, యాడాదికి మూడువేల ... మూడువేల అరుమార్లు. ఇంకజెర కష్టపడి, రెండుపైసలెక్కువ ఖర్చుచేసి గిరాకి మనదెగ్గరికే వొచ్చేటట్టు చేసుకుంటిమా, యాడాది లోపట మన నాల్గువెయిలు మనకు రాకుంటె నా పేరు నారాయణ కాదు. యాడాదైనంక వొచ్చే దంత పుణ్యానికొచ్చినట్లైనా కాదా?'

'అవును' అన్నాడు గోవిందు. ఈసారి అతడు తన బీదరికం గురించి ఏమీ అన లేదు. గోవిందు ఆలోచనలో పడగానే.

'మల్లా కలుస్తా' అని నారాయణ సెలవు తీసుకున్నాడు.

ఆ మరునాడే నారాయణ తన భార్యనూ పిల్లవాన్ని అత్తవారింటికి పంపేశాడు.

నారాయణ అనుకున్నట్టుగానే రెండవ

రోజు రాత్రి గోవిందు హోటల్‌కు వచ్చాడు. నారాయణ డ్యూటీ ముగించుకుని, హోటల్ బయటకు రాగానే 'హోటల్ విషయంల ఎవరన్నా కల్సుకుంటివ ?' అన్నాడు గోవిందు.

'ఇంక లేదు. ఇయ్యాల ఈర(బహ్మం వొచ్చిండె. యీ సంగతి రేపు చెప్తాన్న' అన్నాడు నారాయణ.

'మల్లేం లేదు నా దెగ్గరో వెయ్యినర పైసెల్లుంది. సరిపోతదంటవ?'

కొంచెం ఏకాంతంగ వుండి ఆలోచించి 'వెయ్యినరతోటి ఏమైతది గోవిందూ, రెండు రెండు నాలుగువెయిలైతె అడి కాడికి కటాకట్ సరిపోతది. ఈర(బహ్మం ఇయాలొచ్చి మూడువెయిలైనా పెడ్తాం టున్నడు.'

'అయితే ముగ్గురం కలిసి పెడ్దాము' అన్నాడు గోవిందు.

'నీకు తెల్వదు గోవిందూ యెంత ఎక్వ మంది కలిస్తే అంత తక్వలాభం వొస్తది. ముగ్గురుపట్టి మూడుచెక్కలకు గుంజు తుంటె చిప్ప చేతికొస్తది. నువ్వే చూడు ఎట్లనన్న రెండువెయిలు మట్టంచేస్తె వంటె పెట్టేతాము. ఐదునూర్లకేం ఎన్కకు పోతావు.'

'ఐతె మా ఆడిదాన్ది మూడు తులాలు బంగారంది దండె కడె ఉన్నది.'

'మూడుతులాలా? సరిపోతది' అని నారాయణ నడక చాలించి.

'నగ ఇడుసెందుకు ఇద్దరం రేపే పట్నం పోదాము. అడ మా బావ మరిది దెగ్గర నా పైసలున్నయి. ఇద్దరివి కలిపి బ్యాంకుల ఏసేతాము. జమాన జోస్తె బాగలేదు. పైసలు దెగ్గరుంచుకోవొద్దు. అద్దు దొర్కినంక ఎట్ల జేకైతె అట్ల చేతాము. అన్ని నోట్లు గియా చిల్లర్నే వున్నయా?' అన్నాడు.

'చిల్లర్నె శాన వున్నది' అన్నాడు గోవిందు. వెంటనే ఆ చిల్లరను మార్వాడీ వగ్గరకు తీసుకుపోయి నోట్లుగా మార్పించి ఇచ్చాడు. 'రేపు పొద్దుగల ఐదుగంటల బండికి పోదాము. నీ దెగ్గరికి నేనే వొస్త. తయారుగుండు. ఇప్పుడే ఈర(బహ్మంగిన్నె కల్సుకొని కల్వదని చెప్పేస్త.' అని సెలువు తీసుకున్నాడు.

ఉదయం నాల్గింటికే గోవిందు దగ్గరకు వచ్చాడు నారాయణ. ఆ డబ్బు బంగారము ఒక ఉత్తరీయంలో చుట్టి తన లెదర్ బ్యాగ్‌లో పెట్టి తన వద్దనే వుంచుకున్నాడు. రెండు మూడు స్టేషన్లు దాటిన తర్వాత ఏదో స్టేషన్లో రైలాగి నప్పుడు, నారాయణ బ్యాగుతో దొడ్డిలోకి పోయి వచ్చాడు. క్రిందికి దిగి నీళ్లు తాగాడు. వెంటనే కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చి గోవిందుకు బ్యాగ్ ఇస్తూ ... 'జర్నం. పక్క డబ్బల మా వూరి కోమటోడున్నడు. వానికి యాపారం సంగతులు శాన గుర్తు సూట్లాడుతుంట. పట్నంలనే దిగి మనం కల్సుకుందాం. అని కిందికి దిగి, పక్కకంపార్ట్‌మెంట్‌లో మాయమైయ్యాడు.

గోవిందు పట్నంలో దిగి ప్లాట్‌ఫామ్ మీద చూస్తే నారాయణ లేడు, బ్యాగులో చూస్తే డబ్బు లేదు.

అప్పటి నుంచి నారాయణ (శీనివాసులు ఐనాడు గడ్డం పెంచాడు డబ్బు సంపాదించాడు.

*   *   *

తలనొప్పి మాత్ర వేసుకున్న తర్వాత కూడా నారాయణకు నొప్పి తగ్గలేదు. రోగిలో వుండే నిస్సహాయితా పిరికితనమూ అతనిలో చోటు చేసుకున్నాయి. వొళ్లంతా నొప్పి మంట. వెంటనే లేచి 'ఎ(రోడా, ఎ(రోడా' అని సర్వర్‌ను పిలిచాడు. కింద అల్లరి మూలంగా వీవరూ విని పించుకోలేదు. తానే రెండు మెట్లు దిగి పిల్చాడు. ఎ(రోడు వచ్చాడు. 'చూడవా, ఎదురుంగ ఫూల్‌మీద కుంటి ఈరప్ప వున్నడు. నేను రమ్మన్నని మీదికి పంపియ్య. పనున్నది' అన్నాడు.


'మీదికా?' అన్నాడు సందేహిస్తూ ఎ(రోడు.

'ఎక్కుతడు పది మెట్లెక్కడా? ఒకే కాలున్నది గద' అన్నాడు నారాయణ విసుక్కుంటూ కసిరినట్లుగా. ఐదు నిమిషాల్లో కుంటి వీరప్పను పైన వదిలేసి ఎ(రోడు పనిలోకి పోయాడు. వీరప్ప తల వొంచుకుని నిల్చున్నాడు.

'చూడు ఈరప్పా, నువు చేస్తున్న పని నాకింత గూడ బాగనిపించలేదు. రెక్కల కష్టం చేసి బతుకుతవనుకున్న గని, నువిట్ల నడి సడక్ల బిచ్చమడుగుత వనుకోలేదు.' అన్నాడు నారాయణ.

'ఏంజేయ్యాలె దొరా, ఎక్కడా పని దొర్కకపాయె. ఉపాస ముండి చచ్చే నౌబత్ వచ్చె. ఇంతబతుకు బతికినగని ఇసుంటె కష్టం నాకెప్పుడు రాలేదు. ఇంక ముందల ఏమేం చూసే దున్నదో ఆ పరమాత్ముని కెరుక.' కన్నె కింద సడేసి మూలబడ్డాడు.

కొంచెం ఏకాంగా వున్న తర్వాత 'ఏక్కణ్ణుంచో ఒకగుడ్డోణ్ణిగూడ సంపా



యుంచినట్టున్నవి. జోడిబాగ కలిసింది. ఈ వూరోడు కానట్టున్నడు.' అన్నాడు నారాయణ.

'కాదు. అక్కడ బోధన్ సైటో డంట. పాపం కూలిగీకిలి చేసుకుంట బతికెటోడు. సిన్నప్పట్నుంచి కష్టపడి. రొండేయిలు సంపాయించి పెండ్లి చేసు కుందామని ఓరకు పెట్టుకుంటె, ఎవడో దోఖాబాజి ముండకొడుకు హోటల్ పెడ్దాం హోటల్ పెడ్దామని నమ్మిచ్చి అయిన్ని పైసలెత్తుకొని పరారైండంట, ఇదు వారకు పత్తా లేదు. అనికి ఆ పైసేం జెయ మిస్తడనుకున్న వాడొరా. ఆ ముండ కొడుకు కొనజాలకు పురుగులుపడి సచ్చి పోతడు.'

'పోలీసోల్లకు చెప్పనుండె.'

'ఈడు ఎద్దిదత్తమ్మ బుగులు పట్టి పోలీసులకు చెప్పలేదూ. నాచుట్టు పక్క లోల్లకు చెప్పలేదు. ముందే ఒకకన్ను పోయిండెనంట పైసమీది ఫికరుతోటే ఏడ్చిఏడ్చి ఉన్న కన్నుగూడ పోగొట్టు కున్నడు.'

'ఈ వూరి కెందుకొచ్చిండు?'

'ముట్టుపక్కలోల్లే పట్నంల సర్కారోల్ల కండ్ల దవాఖాన వున్నది. పొయ్యి సూపిచ్చుకరా, రాడుంటె ఎవడు చేస్తడు. పెండ్లామా పిల్లలా. గుడ్డోల్లకు టికెట్టు కూడ అడ్గరంటె రేలెక్కిండంట. చెకినో డొచ్చి ఈవూరి టేషన్ల దించేసిండు. నేను నిన్న రాడ ఏ పనిగూడ దొర్కలేదని ఈవూరికన్న పోదామని టేషన్లనెవున్న. రైలొచ్చింది. డబ్బడప్పకు చెకినో డుంటె, ఇగ ఎక్కలేదు. ఈడు ఏడ్చు కుంట కూకుంటె దెగ్గర్కిపొయ్యి 'ఏం సంగతని' అడ్గితే, ఆడు అని కత చెప్పిండ్చె, నేను నా కతా చెప్పెడిస్తి. ఇగ ఇద్దరం కలిసి అడుక్కోనన్న తిందమాని ఈ ఫ్లాట్‌మీద కూసున్నము.' ఆగి పోయాడు. చీకటిపడింది. నారాయణ లేచి లైటు వేశాడు.

'చూడు ఈరప్పా, నువ్వు అడుక్కోని తింటుంటె నాకే ఎట్లనో అనిపిస్తున్నది. రేపట్నుంచి నిన్ను పనిలోపటికి తీసు కుంట. కూచున్నతాన్నే గిలాసలు కొపి తన్నుర్గిన కడిగెయ్యి. రొండు పూటల అన్నంపెట్టి నెలకు ఏదో పదో ఇస్త.

# వంచన

చేస్తావా?' అన్నాడు.

'ఏందుకు చెయ్య సేట్. ఇంత పూర్తికి దయజూపితె నీ మేలు ఈ జన్మల యాది మరువ.' అన్నాడు వీరప్ప.

'మల్ల ఆ గుడ్డోనిగతి' అన్నాడు నారాయణ.

'ఆడు ఆ ఫ్లాట్‌మీదనే అడుక్కోని బతుకుతుంటడు సేట్'

కొంచెం నవ్వొచ్చింది నారాయణకు. 'నేను నీకు పైసలిస్త రేపు ఆ గుడ్డోన్ని పట్నం తీస్కపో. ఆడ గుడ్డోళ్లకోసము కాళ్లుచేతులు లేనోళ్లకోసము దిక్కులేని ముసలోల్ల కోసము సర్కారోల్ల సత్ర మున్నది. అది యాడున్నదో ఎట్లెట్ల పోవాల్నో అంత రాసిస్త' అని జేబులోని తెల్ల కాగితంమీద అడ్రసూ పోవలసిన తోవా అంతా రాసి వీరప్పకు ఇచ్చి,

'నివనేందంటె సర్కారోళ్ల సత్రంల నీణ్ని షరీక్ చేపిచ్చి. నీకు ఇష్టమని పిస్తె నువ్వుగూడ వుండు. లేకుంటె వచ్చెయ్యి. నేను ఇంతకు ముందు ముగ్గురు నల్గురు గుడ్డోళ్లను అడికి పంపిచ్చిన. వాళ్లే దవాఖానకు తీస్కపొయ్య చూపిచ్చు కుంటరు. రేపు మసుకుల బండికే పొండి. పాపమా గుడ్డోణ్ని నడమనే




యాడనన్న ఇడ్చి వొచ్చేవు. కిందికి రా పైసలిస్త' అని నారాయణ వీరప్పతో కిందికి దిగడు.

తండ్రిని చూడగానే కొడుకు లేచాడు. 'నొప్పి తక్వయిందా నాయినా?' అని అడిగాడు. 'ఇంకా పూర్తిగ తక్వ కాలేదు రారి. ఇంక జెర వున్నది' అని చెప్పి, గల్లాలోనుంచి ఇరవై రూపాయలు తీసి వీరప్పకిస్తూ 'ఇండ్ల పదేను రూపాలు రానుబోను ఖర్చులకు తిండీ తిప్పలుకు నొస్తయి. ఐదురూపాలేమొ ఆ గుడ్డోని చేతిలపెట్టు. ఇట్ల శ్రీనివాసులు సేట్ ఇచ్చిండని వానితోటిగాని, నల్గురితోటి గాని చెప్పే అవసరం లేదు. నేను పేరు రావాల్నని ఇస్తలేను. మీ అసుంటోల్లకు ఎంత ఇచ్చినా తక్వనే ఏమంటవు?' అన్నాడు. 'మంచిది దొర యాది మరువ. రొండాద్దుల్ల వచ్చేస్త. శరణార్థి' అని నమస్కారం చేసి సెలవు తీసుకున్నాడు. వీరప్ప.

నారాయణ వీరప్ప పోయే వైపు చూస్తూ కూర్చున్నాడు. వంతెనకు రెండువైపులా వున్న ట్యూబ్‌లైట్లు పాలి వెలుగును కాస్తున్నాయి. గుడ్డి మనిషి. బిచ్చమడిగే శక్తిలేక, ఆపనేదో బట్టకే నొప్పచెప్పి, కాళ్లు చేతులు ముడుచుకొని పడుకున్నాడు. వీరప్ప తన బట్టల నడ్డ నాల్గైదు పైసలను జేబులో వేసు కున్నాడు. గుడ్డిమనిషి బట్ట లో పడ్డ చిల్లర డబ్బులోనుండి నాల్గైదు బిళ్ల లను తన జేబులో వేసుకుని అతన్ని లేపాడు. గుడ్డిమనిషి తన గుడ్డలో తడుముకుంటూ మిగిలిన డబ్బుల్ని తీసుకుని జేబులో వేసు కున్నాడు. ఇద్దరూ లేచారు. గుడ్డిమనిషి తనచేతిని వీరప్ప చేతిలో పెట్టాడు.

వాళ్లు పోతుంటే నారాయణ నిశ్చిం తగా నిర్భయంగా వాళ్ల వంక చూడ సాగాడు.

ఇప్పుడు నారాయణకు తలనొప్పి పూర్తిగా తగ్గిపోయింది. మనస్సు కూడా తేలిక పడింది. పెదవుల చివరల్లోకి ఎప్పటి చిరునవ్వు వచ్చేసింది. ఆ లోటా ఎంతగిరాకి అయిందో తెలుసుకోడానికి నోట్లు లెక్క పెట్టసాగడు. ●